క్లుప్తంగా

ఏచూరికి నివాళి



మర్రిపాడు : స్థానిక సీపీఎం కార్యాలయంలో ఐద్వా ప్రధాన కార్యదర్శి శ్యామలమ్మ ఆధ్వర్యంలో కామ్రేడ్ ఏచూరి సీతారాం చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏచూరి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సభ్యులు ఖాసింబీ, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాయుడుస్వామికి విశేష పూజలు

వరికుంటపాడు: మండలంలోని పామూరుపల్లెలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పంచమి తిథి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు. స్వామి వారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

91.50 శాతం ఈకేవైసీ పూర్తి

సోమశిల: అనంతసాగరం మండలంలో ఖరీఫ్ పంటల ఈకేవైసీని 91.5 శాతం పూర్తి చేసినట్లు ఏఓ శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలో 1623 మంది రైతులు 4,718 ఎకరాల్లో పంటలు సాగుచేశారని చెప్పారు. ఇప్పటి వరకు 1484 మంది రైతులు 4,295 ఎకరాలకు సంబంధించిన పంటలను ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. సోమవారంతో ఈకేవైసీ కార్యక్రమం ముగుస్తుందని చెప్పారు. మిగిలిన ఉన్న రైతులు చేయించుకోవాలని కోరారు. ఈ–క్రాప్ నమోదు చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాలు, పరిహారాలు అందవని తెలిపారు.

సిద్ధనపాళెంలో గేదెలు అపహరణ

బిట్రగుంట: బోగోలు మండలం సిద్ధనపాళెంలో ఆన్నంగి నవీన్‌కు చెందిన ఆరు పాడి గేదెలు ఆదివారం అపహరణకు గురయ్యాయి. సుమారు రూ.4 లక్షల విలువైన పాడిగేదెలను గుర్తుతెలియని వ్యక్తులు తోలుకెళ్లారని బాధితుడు బిట్రగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై భోజ్య తెలిపారు.

ఇసుక డంప్ సీజ్

చేజర్ల: మండలంలోని కోటితీర్థం ఎస్సీ కాలనీ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను పోలీసులు శనివారం రాత్రి సీజ్ చేశారు. కొందరు పెన్నానది నుంచి ఇసుక జీ అక్రమంగా తరలించి ఎస్సీకాలనీ సమీపంలో డంపు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో వీఆర్వో ఇసుక డంప్‌ను పరిశీలించి తహసీల్దార్, పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో తహసీల్దార్ ఏవీ రమణారావు, సంగం సీఐ వేమారెడ్డి, చేజర్ల ఎస్సై ప్రభాకర్ ఇసుకడంప్‌ను పరిశీలించి సీజ్‌చేశారు. ఇసుక డంప్ చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

25న ఎమ్మెల్యే పర్యటన

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో ఈ నెల 25న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పర్యటించనున్నట్లు ఎంపీడీఓ ఎస్ మల్లికార్జున ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వందరోజు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఇది మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

రేపటి నుంచి పొలం పిలుస్తోంది

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఉదయగిరి ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాల్లో ఉదయం ఒక గ్రామం, మధ్యాహ్నం మరో గ్రామంలో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయంతో పాటు అనుబంధ ఉద్యాన, మత్స్య, మార్కెటింగ్, సెరీకల్చర్ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారని చెప్పారు. వ్యవసాయాన్ని సులభతరంగా, లాభసాటిగా మార్చేందుకు అధునాతన సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు



చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లలో గంగమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత రెండ్రోజులుగా గంగమ్మకు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చివరిరోజు గంగమ్మను వెన్నతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలను సమర్పించారు.

వామ్మో.. బస్టాండ్

ప్రయాణికులకు సౌకర్యాల కల్పనలో కావలి ఆర్టీసీ డిపో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బస్టాండ్‌లో పారిశుధ్యం లోపించినా, దొంగలు చేతివాటం చూపుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రయాణికుల రద్దీకు అనుగుణంగా బస్సు సర్వీసులను నడపడం లేదు. కావలి మీదుగా వెళ్లే ఇతర డిపోల బస్సులను సాకుగా చూపుతూ హైదరాబాద్, బెంగుళూరు, తదితర సుదూర ప్రాంతాలకు బస్సులను నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–కావలి



కావలి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

రోజుకు రూ.13లక్షలకుపైగా ఆదాయం

కావలి ఆర్టీసీ డిపోలో అన్ని రకాల బస్సులు 98 ఉన్నాయి. వాటిలో 91 బస్సులు ప్రయాణీలను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. మరో ఏడు బస్సులు స్పేర్‌లో ఉంటాయి. వాటిని మరమ్మతులకు గురైన బస్సుల స్థానంలో వాటిని వినియోగిస్తుంటారు. కావలి డిపోకు చెందిన బస్సుల ద్వారా సగటున రోజుకు 25వేల మంది ప్రయాణిస్తుంటారు. వారి ద్వారా రోజుకు సగటున రూ.13 లక్షల వరకు రాబడి వస్తోంది. అలాగే ఇతర డిపోలకు చెందిన దూరప్రాంత సర్వీసులు సైతం కావలి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి.



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మురుగు నిల్వ

కొత్త బస్సులు వస్తే పరిశీలిస్తాం



కావలి ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్, బెంగుళూరు వయా తిరుపతి మీదుగా బస్సులు లేని మాట వాస్తవమే. కావలి ఆర్టీసీ డిపోకు కొత్త బస్సులు మంజూరు కానున్నాయి. కొత్త బస్సులు రాగానే బస్సు సర్వీసులు ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తాం.

– రాపూరు శ్రీనివాసులు, మేనేజర్, కావలి ఆర్టీసీ డిపో

ప్రయాణికులకు భద్రత కరువు



ఇటీవల ఒంగోలు కు చెందిన ఓ వ్యక్తి కలిగిరి వెళ్లి వస్తూ కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో దిగాడు. బస్టాండ్‌లో కొద్దిసేపు వేచిచూసిన తర్వాత ఒంగోలు బస్సు రావడంతో ఎక్కాడు. కండక్టర్ రాగానే టికెట్ తీసుకునేందుకు ప్యాంట్ జేబులోని పర్సు కోసం చేయిపెట్టగా లేదు. బస్సు దిగి బస్టాండ్‌లో తాను నిలుచున్న చోటుకు వచ్చి వెతికినా ఫలితం లేదు. భిక్షగాడు రాగా పర్సులో నుంచి చిల్లర తీసి ఇచ్చానని, బస్టాండ్‌లోనే తన పర్సును దొంగలు కొట్టేశారని లబోదిబోమన్నాడు. అనంతరం తన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ఫోన్‌పే ద్వారా నగదు వేయించుకుని బస్సు ఎక్కివెళ్లాడు. అలాగే ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు తిరుపతి వెళ్లేందుకు కావలి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు కోసం ఎదురుచూస్తూ సెల్‌ఫోన్లను కుర్చీల్లో పక్కనే పెట్టుకుని మాటల్లో పడిపోయారు. ఇంతలో తిరుపతి బస్సు రాగా అందరూ ఎక్కి కూర్చున్న తర్వాత రెండు సెల్‌ఫోన్లు కలిపించలేదు. వెంటనే కిందకు దిగి వచ్చి చూడగా ప్రయోజనం లేదు. ఇలాంటి ఘటనలు కావలి బస్టాండ్‌లో నిత్యకృత్యంగా మారాయి. కావలి బస్టాండ్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ఉంది. అందులో పోలీసులు ఎప్పుడు విధుల్లో ఉంటారో..ఎప్పుడు విధుల్లో ఉండరో ఎవరికీ తెలియదు. పోలీసులు ఉంటే బస్టాండ్‌లో సెల్‌ఫోన్లు, పర్సుల దొంగతనాలు జరగవు. వారు లేకపోతే దొంగలు చేతివాటం చూపుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

కావలి బస్టాండ్‌లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మరుగుదొడ్లు ఉన్నా ప్రయాణికులు ఆరుబయటే మూత్ర విసర్జనలు చేస్తుండడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఆరుబయట మూత్ర విసర్జన చేసే వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాల్సిన ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రయాణికులు ముక్కుమూసుకుని బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాండ్ రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉంది. బస్టాండ్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఎవరు వస్తున్నారో, ఎవరు పోతున్నారో కూడా తెలియని పరిస్థితి. దొంగలు హల్‌చల్ చేస్తున్నారు.



ఆరుబయటే మూత్ర విసర్జన చేస్తున్న ప్రయాణికులు

ప్రైవేట్ బస్సులే శరణ్యం

ఇటీవల ఓ కుటుంబం అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగా ఓ వ్యక్తి వచ్చి ఎక్కడకు వెళ్లాలని ఆరాతీశాడు. హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్ రెడీగా ఉందని చెప్పాడు. అతనిపై అనుమానంతో సదరు కుటుంబం బస్టాండ్ లోకి వెళ్లి ఎక్వైరీలో ఆరాతీయగా కావలి నుంచి హైదరాబాద్‌కు సర్వీసులు లేవని తెలిపారు. ఇతర డిపోల బస్సులు వస్తాయని వేచిచూడమని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ సీట్లు ఉంటాయో..లేదోనన్న సందేహంతో ఎంక్వైరీలో అడుగగా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకుంటేనే గ్యారెంటీ అని, లేకపోతే చెప్పలేమని తెలిపారు. దీంతో ఆర్టీసీ బస్సులో సురక్షిత ప్రయాణమనే ఆశతో వచ్చిన ఆ కుటుంబం ఆ భాగ్యం లేదనే నిర్ణయానికి వచ్చింది. బస్టాండ్ నుంచి బయటకు వస్తున్న వారిని గమనించిన తొలుత ఆరాతీసిన వ్యక్తి ప్రైవేట్ ట్రావెల్స్ వద్దకు తీసుకెళ్లి ఎక్కించాడు. ఇలా ఆర్టీసీపై నమ్మకం ఉన్నా కావలి డిపో నుంచి సర్వీసులు లేని కారణంగా ప్రయాణికులు ప్రైవేట్ బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కావలి డిపో నుంచి హైదరాబాద్‌కు గత కొన్నేళ్లుగా బస్సులు నడపకుండా నిలిపేశారు. నిత్యం కావలి నుంచి పదిహేనుకుపైగా ప్రైవేట్ ట్రావెల్స్ హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. కావలి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగానే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నాయి. అలాగే బెంగుళూరుకు వయా తిరుపతి మీదుగా బస్సు సర్వీసులను నిలిపేశారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ బయటి నుంచే ప్రతిరోజూ బెంగుళూరు వయా తిరుపతికి పదికి ప్రైవేట్ ట్రావెల్స్ వెళ్తున్నాయి. ఈ మార్గాల్లో ప్రయాణికుల రద్దీ ఉన్నా ఇతర డిపోల సర్వీసులు కావలి మీదుగా వెళ్తున్నాయనే సాకు చూపుతూ కావలి డిపో అధికారకులు సర్వీసులను నడపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కావలి నుంచి మంత్రాలయం, కర్నూలుకు బస్సు సర్వీసులు నడపాలనే డిమాండ్ ఎంతో కాలంగా ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆర్టీసీ అధికారులు చొరవచూపాలి



కావలి డిపో నుంచి హైదరాబాద్, బెంగుళూరు వయా తిరుపతి మీదుగా బస్సు సర్వీసులు లేవు. కావలి మీదుగా వెళ్లే ఇతర డిపోల బస్సుల్లో వెళ్లాలని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అవి ఎప్పుడు వస్తాయో..వచ్చినా సీట్లు ఉంటాయో..ఉండవో తెలియడం లేదు. దీంతో ప్రైవేట్ బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. కావలి నుంచి బెంగుళూరు, హైదరాబాద్‌కు ప్రయాణికుల రద్దీ ఉన్నందున ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని బస్సులు నడపాలి.

–మహేష్, కావలి

ఉత్సాహంగా..ఉల్లాసంగా



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



స్విమ్మింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కావలి : డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి విశ్వోదయ బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని జవహర్‌భారతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్రీడా పోటీలను కోలాహలంగా నిర్వహిస్తున్నారు. గత మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పట్టణం, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వాలీబాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ , ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నీస్ తదితర పోటీల్లో తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ సత్తాను చాటారు. విశ్వోదయ రెక్టార్ డీ వినయకుమార్‌రెడ్డి, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ డీ మనోహరరెడ్డి, డైరెక్టర్ కే తాతిరెడ్డి, నిర్వాహకులు ప్రసాద్‌రెడ్డి, మాల్యాద్రి, మణికంఠ, బ్రహ్మయ్య , శిరీష్, టీవీ రమణ, జగన్నాథం, తదితరులు పర్యవేక్షిస్తున్నారు.



ఖోఖోలో పోటీపడుతున్న క్రీడాకారులు



తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

మహిళ అదృశ్యం



ఎగ్గోను యానాదమ్మ

మర్రిపాడు: మండలంలోని ఖాదర్‌పూర్‌కు చెందిన ఎగ్గొను యానాదమ్మ మూడ్రోజుల క్రితం అదృశ్యమయ్యారు. శుక్రవారం నాడు కడపలోని బంధువుల వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వచ్చిన ఆమె అక్కడికి వెళ్లలేదు. మూడ్రోజులు గడిచినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 88978 05132 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం



దుత్తలూరు: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని తెడ్డుపాడులో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ వందరోజుల్లో తమ ప్రభుత్వం ఏం చేసిందో వివరించారు. అనంతరం మొక్కలు నాటారు. తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ సంధ్యాలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ వెంకటరత్నం, సర్పంచ్ బీ వెంకటరత్నం పాల్గొన్నారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గస్థాయిలో అండర్–14,17 స్కూల్ గేమ్స్‌ను సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నట్లు పీడీలు ప్రభాకర్ రెడ్డి, తిరుపాల్‌రెడ్డి ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. సోమవారం బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం బాలికలకు కబడ్డీ, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 25న ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీలను బాలబాలికలకు నిర్వహిస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికలకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామని తెలిపారు.

బైక్ స్వాధీనం



సంగం: మండలంలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి ఆదేశాలతో పోలీసులు ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సంగం బ్యారేజ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు బైక్‌లపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా నైట్‌బీట్ పోలీసులు గుర్తించి వెంబడించారు. సంగం హైస్కూల్ సెంటర్ సమీపంలో ఒక బైక్‌ను వదిలేసి వారు పరారయ్యారు. దీంతో పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

న్యాయం చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఆశాకార్యకర్తలు

కలిగిరి: రావులకొల్లు ఆశాకార్యకర్త, దళిత మహిళ పందిటి విజయమ్మను రాజకీయ ఒత్తిళ్లతో తొలగించారని, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవ చూపి ఆమెకు న్యాయం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్‌మాదిగ డిమాండ్ చేశారు. కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విజయమ్మకు మద్దతుగా ఆశాకార్యకర్తలు రెండోరోజు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అంబేడ్కర్ మాదిగ సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే దళిత మహిళ విజయమ్మను తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆశా కార్యకర్తల సంఘ జిల్లా అధ్యక్షురాలు కే విజయమ్మ మాట్లాడుతూ చిరుద్యోగులపై కొందరు అధికారపార్టీ నాయకులు వేధింపులకు దిగడం సమంజసం కాదన్నారు. విజయమ్మను విధుల్లోకి తీసుకునేంత వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్తల యూనియన్ నాయకులు మేరీ, అరుణ, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు



కోడిపందేల నిర్వాహకులతో పోలీసులు

కావలి : మండలంలోని పెద్దవరం–ఆర్సీపాళెం మార్గంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై కావలి రూరల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,400నగదు, నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కావలి రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై బాజీ బాబు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. మండలంలో కోడిపందేలు, పేకాట, గంజాయి విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మద్దూరుపాడులోని ఏఎంసీ మార్కెట్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో కావలి రూరల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై ఎం బాజీబాబు తన సిబ్బందితో కలిసి దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,130ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జలదంకి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని బీజేపీ మండల ప్రదాన కార్యదర్శి వంటేరు రాకేష్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపడుతున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా బ్రాహ్మణక్రాక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు చల్లా హనుమారెడ్డి, పెద్దిరెడ్డిసాయి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా



సోమశిల: అనంతసాగరం మండలంలో గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి గ్రావెల్‌ను తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని కొత్తపల్లి నుంచి అనంతసాగరం గ్రామానికి ఆదివారం పట్టపగలే మూడు టిప్పర్లతో గ్రావెల్ తరలింపు చేపట్టారు. అయినా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

యూటీఎఫ్ సంక్షేమ నిధి అందజేత



జలదంకి: మండలంలోని చింతపాళెం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దాసరి పుల్లయ్య గత నెల 27న మృతి చెందారు. ఆయన సతీమణి ప్రమీలకు యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు రూ. 1.25 లక్షల చెక్కును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి నగదు సాయం అందజేసినట్లు తెలిపారు. యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటుందన్నారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, కుటుంబ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐహెచ్‌ఎల్ ప్రసాద్, కార్యదర్శి నాగిరెడ్డి, కోశాధికారి జమీర్ అహ్మద్, డైరెక్టర్ లక్ష్మి, జలదంకి మండలాధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు తిరుపతిస్వామి, హనుమంతరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పోలేరమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో గ్రామదేవత పోలేరమ్మ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి చద్ది సమర్పించారు. 21 రోజుల పాటు అమ్మవారికి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు, గ్రామపెద్ద కాపు మెట్టుకూరు పద్మారెడ్డి తెలిపారు.

ఆత్మకూరులో భారీ వర్షం



తూర్పువీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



పిడుగుపడి కాలిపోతున్న తాటిచెట్లు

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి తూర్పువీధిలోని మసీదు వెనుక ప్రాంతంలో రోడ్లపై నీరు నిలిచిపోయి ఇళ్లలోకి చేరింది. మున్సిపల్ పరిధిలోని కాశీనాయన ఆశ్రమం మార్గంలోని తాటిచెట్లపై పిడుగులు పడ్డాయి. దీంతో భయాందోళనలకు గురైన సమీపంలో పశువులు మేపుతున్న పలువురు ఆశ్రమంలోకి పరుగులు తీశారు. కాగా కొద్దిరోజులుగా వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్న తరుణంలో కురిసిన భారీ వర్షం ప్రజలకు ఉపశమనం కల్పించింది.

కలిగిరిలో ఓ మోస్తరు వర్షం

కలిగిరి: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. రైతులకు వర్షం ఎంతో ఊరట ఇచ్చింది. పొలాల్లో పచ్చిక పచ్చుబడే అవకాశం ఉందని పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సజ్జకు మద్దతు ధర కల్పించాలి



కృష్ణారెడ్డిపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన సజ్జ పంటకు మద్దతు ధర కల్పించాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో రైతులతో కలిసి ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో సజ్జల ధర చాలా తక్కువగా ఉందన్నారు. ఈ ఏడాది దిగుబడులు తగ్గాయని, తక్కువ ధరకు విక్రయిస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధరకు సజ్జలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.